

ఎంటీఆర్ ఎండీ శ్రీనివాస్‌కి రెడ్డి కార్మికుల సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బాలానగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ అభివృద్ధి కోసం చమటోడ్చి పని చేసే కార్మికులను కష్టాల పాలు చేసే పరిశ్రమలకు మనుగడ ఉండదని అందుకే కార్మికులను యాజమాన్యం కన్న బిడ్డల్లా చూసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బాలానగర్ ఎంటీఏఆర్ పరిశ్రమ యాజమాన్యానికి సూచించారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు పరిశ్రమ ఎండీ శ్రీనివాస్‌రెడ్డితో కార్మికుల సమస్యలపై చర్చించారు. కార్మికుల సమస్యలు పెద్దవేమి కావని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎండీని కోరారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ ఆర్ మేనేజర్ పుష్పరాజ్, జగన్, పరిశ్రమ కార్మిక యూనియన్ అధ్యక్షుడు రాజయ్య, సతీష్‌నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

చలివేంద్రం ప్రారంభం

జీడిమెట్ల/గాజులరామారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చటానికి స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ అన్నారు. జీడిమెట్ల హమాలీ అడ్డ వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్, సీపీఎం కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, స్వామి, దేవదానం పాల్గొన్నారు.



ప్రహరీని కూల్చి వేసిన పార్కు స్థలం ఇదే

ప్రహరీ నిర్మించి పార్కు స్థలాన్ని కాపాడాలి

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పార్కు కోసం కేటాయించిన స్థలంలో చుట్టూ ప్రహరీ నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పార్కు స్థలంలో కొందరు ఓ భవన నిర్మాణం చేస్తున్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని దండమూడి ఎన్‌క్లేవ్ ఫేజ్-2లో ఉన్న పార్కు స్థలం చుట్టూ ఉన్న ప్రహరీ గోడను కూల్చి వేసి అందులో నుంచి రాకపోకలు సాగిస్తుండగా, ఓ భవన నిర్మాణదారుడు ఉన్న ప్రహరీని కూల్చివేసి ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నాడు. స్థానికులు ఇదే మని ప్రశ్నిస్తే ఎదురు దాడికి దిగుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. పార్కు స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

'పార్టీల కతీతంగా బీసీ అభ్యర్థులను గెలిపించాలి'

దుండిగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీల కతీతంగా ఎంపీలుగా పోటీచేసే బీసీ అభ్యర్థులను గెలింపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని బీసీ ఐక్యా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్‌లో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అత్యధికంగా బీసీలు ఎంపీ సీట్లు గెలుచుకొని పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని బీసీలకు రిజర్వేషన్‌లు సాధించే విధంగా బీసీలందరూ రాజకీయా పార్టీల కతీతంగా ఏకం కావాలని పిలుపు నిచ్చారు. హైదరాబాద్‌లో బీసీ భవనానికి పది ఎకరాల స్థలం, రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయాలని, ప్రతి జిల్లా కేంద్రంలో బీసీ భవనాలకు స్థలం ఇచ్చి నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ బీసీ ఐక్యా వేదిక అధ్యక్షులు రంగు కాంత్రి, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, బీసీ వేదిక రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఆరే దశరథం పాల్గొన్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

దుండిగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా నుంచి గంజాయి తీసుకవచ్చి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను సైబరాబాద్ ఎస్ఓటీ, దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ.33 వేల 750 విలువ చేసే గంజాయిని పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిస్సాకు చెందిన రంజన్ దాస్ (26), కేశవ్‌కౌడ్(28)కె. గంగ (31)లు గండిమైసమ్మ సమీపంలోని శ్రీ చైతన్య క్యాంపస్ సమీపంలో గుడెసెలు వేసుకొని సెంట్రింగ్ పని చేస్తుంటారు.సెంట్రింగ్ పనిలో సంపాదన తక్కువ రావడంతో ఎక్కువ సంపాదించాలనే ఆశతో ఒడిస్సాకు చెందిన రావణ్ (16) గంజాయి సరఫరా చేయాలని ముగ్గురు కోరారు. రావణ్ మల్కన్‌గిరి ఒడిస్సా నుంచి హైదరాబాద్‌లోని గండిమైసమ్మకు తీసుకొని వచ్చి రంజన్‌దాస్, కేశవ్‌కౌడ్, గంగలకు గంజాయి కిలో రూ.7 వేల చొప్పున 1.35 కేజీల గంజాయిని ఇచ్చాడు. గంజాయి విక్రయిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు దుండిగల్ సమీపంలోని చింతల్ యాదగిరి ఖాళీ స్థలంలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించగా రావణ్ సరఫరా చేశాడని నిందితులు ఒప్పుకున్నారు. రావణ్ పరారీలో ఉండగా ముగ్గురిని అరెస్ట్ చేసి, ఒక సెల్ ఫోన్ రూ. 33 వేల 750 విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ... యువకుడి మృతి



మృతి చెందిన సంపత్‌కుమార్

జీడిమెట్ల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై అక్కడి కక్కడే మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సంగారెడ్డి జిల్లా కగ్గి మండలం, సిద్దంగిరి గ్రామానికి చెందిన రత్నప్పకుమారుడు ఎం.సంపత్‌కుమార్ (35) బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి సూరారంకాలనీ ప్రాంతలోని సాయిబాబానగర్ మొండి నర్సింహాబస్తీలో ఉంటూ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నాం 1 గంటల సమయంలో సంపత్‌కుమార్ జైరాజ్‌ఇస్పాత్ ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి ఇంటికి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టడంతో సంపత్‌కుమార్ కిందపడ్డాడు.

లారీ ముందు చక్రాలు తలపై నుంచి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై ఆక్రమణల తొలగింపు



కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

కూకట్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని జాతీయ రహదారిపై ఆక్రమణలను బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి కమాన్ నుంచి వివేకానందనగర్‌కాలనీలోని వివేకానంద విగ్రహం వరకు ఉన్న జాతీయ రహదారిని ఆనుకొని భారీ షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేశారు. సదరు షాపింగ్ మాల్స్ నిర్వాహకులు జాతీయరహదారిలోని సర్వీసు రోడ్డును ఆక్రమించి పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు అందుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు ఆక్రమణలను తొలగించారు. రహదారి ఆక్రమణల తొలగింపును జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్, సెక్షన్ అధికారి సోమేష్ ఆధ్వర్యంలో జరిగింది.

ట్రాఫిక్, రహదారిపై ఆక్రమణలు, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసే ఫుడ్ స్టాల్స్‌పై కఠినంగా వ్యవహరిస్తామని టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీ పీ రమేష్ తెలిపారు. రహదారి ఆక్రమణల తొలగింపు కారణంగా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించిందన్నారు.

భారీగా ట్రాఫిక్ జాం...

జాతీయరహదారిపై వెలసిన ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించే క్రమంలో బుధవారం కూకట్‌పల్లిలో భారీ ట్రాఫిక్ జాం ఏర్పడింది. భాగ్యనగర్‌కాలనీ నుంచి వివేకానందనగర్‌కాలనీ సమీపంలోని యూటర్న్ వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు వాహనాలు ముందుకు సాగేలా చర్యలు తీసుకున్నారు.

కాంగ్రెస్ విజయం కోసం పనిచేయాలి

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచులు, 200 మంది బీఆర్ఎస్ నాయకులు



రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్‌లు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేయాలని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేందర్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, మాధవి యాదగిరిరెడ్డి, సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగయ్యతోపాటు 200 మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రంజిత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కుండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే ఇప్పటి నుంచే ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. మన ప్రాంతం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డిల్లీలోని పార్లమెంట్‌లో మన వాణిని వినిపించాల్సిన అవసరమున్నదని, అందుకోసం చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలని అన్నారు. గతంలో ఎంపీగా ఉన్నపుడు వందల కోట్ల నిధులు తీసుకొచ్చి నియోజక వర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్, కోటేశ్వర్‌గౌడ్, జీవన్‌గౌడ్, పక్రుద్దీన్, రఫీక్, సిద్దేశ్వర్, చంద్రశేఖర్, సురేష్, జిల్లా అనంద్, ప్రభాకర్, అంజనేయులు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఆదరించండి

● అభివృద్ధి చేసి చూపిస్తాడు: సీతారంజిత్‌రెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని ఆయన సతీమణి సీతారంజిత్ రెడ్డి కోరారు. చేవెళ్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాడని ఆమె అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని 15వ వార్డులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలించాలని ఓటర్లను అభ్యర్థించారు. తన భర్త గత ఐదు సంవత్సరాలుగా ఎంపీగా ఉండి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ఈసారి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమైందన్నారు. గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా రంజిత్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి చేతి గుర్తుపై ఓటువేసి ఆదరిస్తే మహేశ్వరాన్ని మరింత అభివృద్ధి చేస్తాడని, రంజిత్‌రెడ్డి ఎప్పుడు ప్రజల సంక్షేమంకోసం పరితపిస్తారని అన్నారు. ప్రచారంలో టీపీసీసీ కార్యదర్శి గోగికార్ జానకీ రామ్, తుక్కుగూడ మున్సిపల్ వైస్‌చైర్మన్ బి. వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ తేజశ్విని శ్రీకాంత్, మాజీ సర్పంచ్ దేవరాయ సుధాకర్, రాజేందర్, పద్మ భాస్కర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత, యాదయ్య పాల్గొన్నారు.



తుక్కుగూడలో ప్రచారం చేస్తున్న సీతారంజిత్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలి: విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రధాన నరేంద్రమోదీ పరిపాలనలో భారత దేశ కీర్తిప్రతిష్ఠలు గణనీయంగా పెరిగాయని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజాఆశీర్వాద యాత్రలో భాగంగా బుధవారం శంకర్‌పల్లి మండలంలోని లక్ష్మారెడ్డిగూడ, గాజులగూడ, దోబిపేట్, అలంకాన్‌గూడ, పత్తేపూర్, బుల్కాపూర్, మోకిల, ప్రొద్దటూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. సాయంత్రం చేవెళ్ల మండలంలోని ఎన్కెపల్లి, ఆలూర్, మీర్జగూడ, బస్తేపూర్, చనువల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్ భారతదేశం నరేంద్రమోదీ వెంటే నడుస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభంజనాన్ని ఎదుర్కొకోలేక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళకు పారిపోయారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సబ్సిడీలపై ఎరువులను అందిస్తూ మద్ధతు ధర ఇస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన కేసీఆర్

రైతులకు 2 లక్షల రుణమాఫీ, వృద్ధులకు పెంచిన పెన్షన్ అందించకుండా మోసం చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. రైతులకు బోనస్ కూడా ఇవ్వలేదని ఎద్దెవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పదేళ్లు పాలించి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని దివాలా తీసిన రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని భారీ మెజారిటీతో గెలిపిస్తే చేవెళ్ల ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఎన్నికల్లో ఓడించి బీజేపీకి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నం, మైలార్‌దేవులపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, చేవెళ్ల కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ. బీర్లనర్సింలు, సీనియర్ నాయకులు సురేశ్ యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, బొడ్డు రవి, జంగారెడ్డి, వెంకటేశ్, లక్ష్మారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెడ్సీ అభిలాష అభినవ్

అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

● జెడ్సీ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కఠినంగా వ్యవహరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో బుధవారం ఆమె అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, అక్రమ నిర్మాణాలను అరికట్టడంపై ప్రత్యేకంగా చర్చించారు. ఫిర్యాదులు అందిన వెంటనే కూల్చివేతలు చేపట్టాలన్నారు. ప్రజలు కూడా నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇక జోన్ పరిధిలోని పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, జీవీపీ పాయింట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు ఉమాదేవి, చిన్నారెడ్డి, రమేష్, కృష్ణయ్య వైద్యాధికారులు, టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల గ్రామంలోని వేంకటేశ్వర శివవీరాంజనేయ ఆలయం 20వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆంజనేయస్వామికి అభిషేకం, గణపతి హోమం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం అలివేలు పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణం జరుగుతుందని, పల్లకి సేవ, అన్నప్రసాద కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు.



శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న జనం

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నిజాంపేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌ల్లో సమస్యలను పరిష్కరించాలని కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని పలు డివిజన్ల ప్రజలు బుధవారం ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరించారు. స్పందించిన ఆయన పలు శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పలు డివిజన్‌ల ప్రజలు పాల్గొన్నారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

● 13 మంది నిందితుల అరెస్ట్

● వీరిలో నలుగురు మైనర్లు

నిజాంపేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న ప్రగతినగర్‌లో హత్య చేసిన నిందితులను బాచుపల్లి పోలీసులు 13 మందిని అరెస్ట్ చేశారు. అందులో నలుగురు మైనర్లు కూడా ఉన్నారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్ ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ మోతీనగర్‌కు చెందిన నిందితులు ముందుగానే పథకం ప్రకారం ఓ హోటల్లో తేజాస్ హత్య గురించి చర్చించుకున్నారు. అనంతరం శివప్ప తేజాస్ ఇం టికి వెళ్లి మద్యం తాగాడు. వారి ప్రణాళిక ప్రకారం అపార్టుమెంట్ పై అంతస్తు నుంచి తేజాస్‌ను కిందికి తీసుకవచ్చి, తన స్కూటీపై సమీర్ వద్దకు తీసుకవెళ్లాడు. సమీర్ తన వద్ద ఉన్న కత్తితో తేజాస్‌ను పొడిచి చంపాడు. హత్యకు సహకరించిన రోహిత్, షమీర్, సిద్దేశ్వర్, శివప్ప, గణేష్, సునీల్, రాహుల్, తిరుమల్, మహేష్‌లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నలుగురు మైనర్స్‌ను జువెనైల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సిబ్బందిని డీసీపీ అభినందించారు.

పదోన్నతుల్లేవు.. మెడికల్ బిల్లులు ఇవ్వట్లేదు

● జేఎన్‌టీయూ వీసీతో బోధనేతర సిబ్బంది గగ్గోలు



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మూడేళ్లుగా తమ ఆవేదనను పాత, కొత్త రిజిస్ట్రార్లు ఆలకించలేదని జేఎన్‌టీయూలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు, అధికారులు ఆరోపించారు. యూనివర్సిటీ ఉద్యోగులతో బుధవారం సమావేశమై.. ఏవైనా సమస్యలుంటే తెలపాలని వైస్ చాన్స్‌లర్ కె.నర్సింహారెడ్డి కోరగా.. బోధనేతర సిబ్బంది తమ కష్టాలను ఏకరువు పెట్టారు. పలువురు ఉద్యోగులు, అధికారులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఉద్యోగులకు, పెన్షనర్లకు మెడికల్ బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. యూనివర్సిటీలో అవసరానికి మించి భవన నిర్మాణాల పేరిట కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల బిల్లులు వెంటనే చెల్లిస్తున్నారు గానీ, ఉద్యోగుల మెడికల్ బిల్లులను (సుమారు రూ. 10 లక్షలు) మాత్రం ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను అకారణంగా దూర ప్రాంతాలకు బదిలీ చేశారని, వారిని తిరిగి వెనక్కి తెప్పించాలని కొన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వీసీ దృష్టికి తెచ్చారు. ఉద్యోగులు లేవనెత్తిన సమస్యలపై వీసీ స్పందిస్తూ.. మెడికల్ బిల్లులను వారంలోగా క్లియర్ చేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగియగానే పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఎంతో కాలంగా దూరప్రాంతాల్లోని జేఎన్‌టీయూ కళాశాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కూడా హైదరాబాద్‌కు రప్పించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. సమావేశంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మినిస్టీరియల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, పలువురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, డిప్యూటీ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్‌స్కేల్!

పాతికేళ్లుగా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను టైమ్‌స్కేల్ ఉద్యోగులుగా పరిగణించాలని పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వీసీ నర్సింహారెడ్డిని కోరారు. ఖాళీగా ఉన్న సీనియర్ లెవల్ పోస్టులను అంతకంటే కిందిస్థాయి సిబ్బందితో నింపాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతియేటా ఇంక్రిమెంట్ ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి పాలకమండలి ఆమోదంతో ప్రభుత్వానికి పంపాలని మరికొందరు ఉద్యోగులు కోరారు. వీసీ స్పందిస్తూ.. టైమ్‌స్కేల్ ఇచ్చే అంశం తన పరిధిలో లేదన్నారు. యూనివర్సిటీలో 1,200మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని, అందరి ఇబ్బందులను తీర్చే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగుల సమస్యలను రాతపూర్వకంగా రిజిస్ట్రార్ సమర్పిస్తే, వాటిలో తమకు సాధ్యమయ్యే అంశాలను మాత్రం వెంటనే పరిష్కరిస్తామని వీసీ హామీ ఇచ్చారు. వీసీతో జరిగిన సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మహేశ్, గోపాల్, నర్సింగ్‌రావు తదితరులు మాట్లాడారు. ఇదిలా ఉంటే.. మూడేళ్లుగా సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేసి, తీరా పదవీ విరమణ చేయబోయే సమయంలో.. సమస్యలుంటే చెప్పండి, పరిష్కరిస్తానని వీసీ చెబుతుండడం విడ్డూరంగా ఉందని కొందరు రెగ్యులర్ ఉద్యోగులు సమావేశం నుంచి బయటకు వచ్చాక విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు ఇవన్నీ కంటితుడుపు సమావేశాల్లాగే ఉన్నా యే గానీ, ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారు లు పరిష్కరించే పరిస్థితి కనిపించ లేదని మరికొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోయారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి : ఈటల



రోడ్ షో లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గాజులరామారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలే ప్రజలకు చేరువవుతున్నాయని మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్‌లోని నెహ్రూ నగర్ నుంచి షాపూర్ నగర్ వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం గాజులరామారం చిత్తారమ్మ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోడ్ షోలో నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కరోనా కష్టకాలంలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి ఒక్కరికి వ్యాక్సిన్ ఇచ్చి ప్రజల ప్రాణాలను కాపాడరన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మళ్లీ నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హస్తం గూటికి కనక రాజు



సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కనకరాజు

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ గొల్ల కురుమ నవ నిర్మాణ సంఘం అధ్యక్షుడు కనక రాజు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓల్డుబోయినపల్లికి చెందిన సీనియర్ నాయకుడు దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరారు. కనకరాజుతో పాటు అంజయ్యనగర్‌కు చెందిన గోపాల్ ముదిరాజ్, మల్లేష్, కుంటయ్యలకు సీఎం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.